


రైలు కూతపెట్టి కదిలింది. రకరకాల అనుభూతులనూ, ఆలోచనలనూ, ఆందోళనలనూ, నింపుకున్న మానవ హృదయాలతో అది సాగిపోతున్నది - ముందుకు, యింకా ముందుకు.

అత్రుతగా గేటుదాటి ప్లాట్ ఫారం మీదికి పరుగెట్టుకుంటూ వచ్చిన మృదుల పాదాలు ఆగిపోయాయి. రైలు అందుకొని ఆలస్యం లేకుండా గమ్యం చేరిపోవాలని ఆమె ఎంత మనసు పడిందో!... అందనిరైలు ఆమె హృదయాన్నంత నిరాశతో నింపి వెళ్ళిపోయింది అలాగే కొన్ని క్షణాలు నిలిచిపోయింది అక్కడే-

ఉస్సురంటూ చేతిలోని బ్యాగ్‌తో వెయిటింగ్ రూమ్‌వేపు దారితీసింది. మరో ఐదు గంటలదాకా బండి లేదు

వెయిటింగ్ రూములో నలుగురైదుగురు వున్నారు. చేతిలో బాగ్ బల్లమీద పెట్టి యీజీచైరులో వాలి కళ్ళు మూసుకుంది.

మనోపథంలో మనోహర్ మధురాకృతి కదిలింది.

ఏం చేస్తున్నాడో?

ఆమె మనసు మెరపుకన్న వేగంగా అతని సన్నిధిలోకి వెళ్ళిపోయింది.

ప్రేమ! మనిషినీ మనిషినీ బంధించే యీ ప్రేమ చాలా చిత్రమైనది. ఒక్క తెలుపులోనే ఏడురంగులు అంతర్లీనంగా ఉన్నట్లు యీ ప్రేమలో అన్ని అనుభూతులూ దాగిఉన్నాయి. అసిధారావ్రతమేనేమో ప్రేమించట మంటే!

ఆ ప్రేమానుబంధంవల్ల మృదుల మనసు మనోహర్ వైపు ఆకర్షింపబడుతోంది. ఎన్ని ఆలోచన లున్నా మరెన్ని అనుభూతు లున్నా, ఆవేదనలూ, అనుమానాలూ వున్నా, ఆ ఆకర్షణనుండి ఆమె మనస్సు మంత్రీభూతం కాకుండా వుండదు.

ప్రేమించటం వేరు; అర్థం చేసుకోవటం వేరు. ఇవి రెండు ఒకటే అని ఒకప్పుడు తలుస్తుండేది. ప్రేమించిన వానినే పెండ్లి చేసుకుంటే, ఆ రెండు జీవితాలమధ్య ఉత్పన్నం కాగల సమస్యే లేదనుకుంది. జీవితం నందనవనమే, ఒక మాధురీస్వరమే అనుకుంది. అది అమాయకత్వం; కాదు కాదు అజ్ఞానం.


మనోహర్‌ను తాను అర్థం చేసుకున్నాననుకుంది. ఇక అర్థం చేసుకోవలసిన దేముంది. అతడు తనవాడనుకుంది. అక్కడే తాను పెద్ద పొరపాటు పడింది.

సరి...ఇప్పుడైనా తనను తెలుసుకుని, అతనిని తెలుసుకున్నా నన్న ధైర్యంతో బయల్దేరిందా తను!

ఒక గాలి వీచింది. ఒక భావం రేపింది. ఒక ఆలోచన కదిలింది_ తనదే పొరపాటేమో అంది. ముఖాముఖీ మాట్లాడుకుందాం. అపార్థాలు తొలగించుకుందాం అన్నది. అంతే ఆ ఆవేశంలో, ఆ వూపులో, ఆ వేగంతో, మృదుల బయలుదేరింది.

అందని రైలు ఆమె ఆవేశాన్ని అణచివేసింది. కళ్లు మూసుకోగానే, మనోద్వారాలు తెరచుకున్నాయి.

కనుకొలకులలో నిలచిన భాష్పకణం




ఆమెకు ఆమె పెళ్ళినాటి విషయాలను స్ఫురణకు తెచ్చింది.

మనోహర్‌తో మృదులకు పరిచయం తమాషాగా అయింది. ఆమె ప్రాణ స్నేహితురాలు మంజుల పెళ్ళికి వెళ్దామని హౌరాఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తోంది ఆ రోజు. రాజమండ్రిలోకాటోలు పదిమంది ఆడా మగా మిత్రులతో సందడిగావచ్చి ఆమె ఉన్న ఫస్ట్‌క్లాసులో ఎక్కాడో అందమైన యువకుడు. సామాను సర్దుకుని బండి కదిలిందాకా స్నేహితులతో కేరింతలు కొడుతూనే ఉన్నాడు. మృదుల అతని వైఖరిని వింతగా చూస్తోంది; బండి కదిలింది.

కనిపించినంతవరకు మిత్రులకు టాటా చెప్పి, ఆతడు లోపలికి వచ్చాడు. అందర్నీ తేరిపార చూసి, తన సీట్లో ఒక పుస్తకం పుచ్చుకుని కూర్చున్నాడు. ప్రయాణం జరిగినంత సేపూ ఆమె మధ్య మధ్య అతన్ని గమనిస్తూనే వుంది. పొరపాటునైనా ఆతడు తనకేసి కన్నెత్తి చూడకపోవటం గమనించి 'అబ్బో! యీ అబ్బాయికి చాలా గర్వం' అనికూడా అనుకుంది.

బెజవాడ స్టేషనులో బండి ఆగుతూండగానే మంజుల అక్క విజయ వచ్చింది—'హల్లో' అనుకుంటూ.

ప్రతిగా మృదులే కాదు, ఆ యువకుడూ నవ్వుముఖంతో పలికాడు. మృదుల తెల్లబోయి చూస్తే విజయ చెప్పింది: "మా బంధువు, మిత్రుడు కూడాను. పేరు మనోహర్, యం. ఎస్సీ.

పాసైనాడు" అంటూ "ఈ అమ్మాయి మృదుల. మంజుల ప్రాణస్నేహితు రాలు. సెకండ్ బి. ఎస్సి. లో వున్నది. రండి; మంజుల మీకోసం చూస్తోంది. కారు తెచ్చాను. పోదాం," అంది.

మనోహర్‌తో అలా మొదలైంది పరిచయం. ఆ రోజు మంజు పెళ్ళిలో ఎంతసందడి చేశాడు మనోహర్! ఆడవా ళ్ళనీ. మగవా ళ్ళనీ భేదం లేదు మనో హర్‌కి. ఒకటే నవ్వులు, కేరింతలు. పసి పాపలా నిర్మలమైన నవ్వాతనిది. అందాన్ని చూసి పరవశించే స్వభావం అతనిది. 'అతని సరళ స్వభావానికీ చిలిపితనానికీ ముగ్ధురాలైంది మృదుల. స్నేహితులతో ఇట్టే కలిసిపోయే అతని స్వభావానికి పరవశురాలైంది.

అతని సన్నిధిలో తనబుగ్గలు ఎరు పెక్కటం మనోరమ గమనించింది. తిరిగి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. మనో హర్ మృదులలమధ్య పరిచయం ప్రేమగా పరిణతి నొంది పరిణయందాకా తెచ్చింది.

పెళ్ళి నూరేళ్ళపంటే! ఆ పెళ్ళికి ముందు ప్రతి స్త్రీ పురుషుడూ ఎంత ఆలో చిస్తారో, నిర్ణయానికి వస్తారో తనకు తెలియదు. కాని తాను అంత ఆలోచించ వలసిన అవసరం వున్నట్లు తోచలేదు.

పెళ్ళి నిశ్చయ మయిందని తెలిసి మనోరమ వచ్చింది. "హల్లో, మృదూ! హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అంటూ విష్ చేసింది. ప్రక్కన కూర్చుంటూ "ఎలా గైతేనేం మనోహర్ మనసు హరిం చేశావు," అంది.

మృదుల సిగ్గుగా నవ్వింది.

"అమ్మయ్య! వచ్చావుకదా పెళ్ళికి; రావేమోనని బెంగపడ్డాను," ఉల్లాసంగా అంది.

"ఈ బెంగ ఇంకా ఎన్నాళ్ళలెద్దూ," స్నిగ్ధంగా నవ్వింది మనోరమ.

"అదేమిటి అమ్మమ్మలా మాట్లాడు తున్నావు:" ఫక్కుమంది మృదుల ముత్యాలహారం సరిచేస్తూ.


"అవును మరి, మనోహరుని రాకతో యింకా మేము ఏమి గుర్తుంటాము లెద్దూ."

"గుర్తుంచుకో వద్దంటావా ఏమిటే మనూ! అందుకేనా యినాళ్ళయినా నన్ను చూట్టానికి రాలేదు;" ఎదురు దెబ్బ కొట్టాననే ధీమాతో అంది మృదుల.

"నీ ముఖంగాని నీ మనోహర్ సంగతి చెప్పు కాస్సేపు," మనోరమ అడిగింది.

మృదుల పెదవులు నవ్వుతో వంపు తిరిగాయి.

"నీకు మనోహర్ తత్వం తెలిసిందా అని? అందం అంటే పరవసిస్తాడు. ఆడపిల్లలతోకూడా స్నేహం చేస్తాడు. అందమే ఆనందం అన్న తత్త్వ మాత నిది. ఆతనితో పెళ్ళి అంటే నీవు ముందు ఈర్ష్యను జయించాలి;" నవ్వింది మనోరమ.




ఎందుకో మృదుల ఉలిక్కిపడింది. మనోరమవైపు తేరిపార చూచింది.

"భయం వేసిందా! ఒట్టి పిచ్చిదానివి. మనోహర్ సౌందర్యపిపాసి. అందమైన ప్రతివస్తువూ ఆతన్ని ఆకర్షిస్తుంది. ఈ విషయం ముందే తెలుసుకుంటే, ముందు ముందు నీవు గాయపడవలసిన పనివుండదు. ఆతని స్వభావంలోని ఒకగుణాన్ని, నాకు అర్థమయిన దాన్ని నీకు చెబుతున్నాను—అర్థం చేసుకుని ముందుకు సాగుతావనే ఆశతో," అంది మనోరమ పెద్ద అనుభవజ్ఞురాలిలా.

మృదుల తేలిగ్గా నిశ్వసించింది; "అబ్బ అంతేనా; ఏమిటోనని హడలిపోయాను."

"అదే అని కాదు మృదులా! స్వభావాన్ని జీవితం పంచుకున్నవాళ్ళు అర్థం చేసుకోవటం, సానుభూతి చూపటము అసంభవం. అందుకనే నీకో యిప్పుడు చెప్పటం."

"అది సరేలే, ఒట్టి భయం నీకు. జీవితము మీద ఆశతో, కోరికతో, విశ్వాసంతో పురోగమిస్తున్నప్పుడు భయాలూ, సందేహాలూ పెట్టుకుంటే కష్టం. పరిపూర్ణ విశ్వాసంతో నేను ముందుకు నడుస్తున్నాను మనూ."

"అదే నేను కోరేది. నీ భావాలకూ, అనుభూతులకూ ఏ అవాంతరమూ రాకూడదు."

... అర్కాడిత ఆగిపోయింది.
రాత్రి పడుకోబోయేముందు మళ్ళీ మనో
రమ మాటలు జ్ఞప్తికి వచ్చాయి.

అవును మనోహర్‌కి స్నేహం అంటే
పిచ్చి. అందం అంటే పులకరింపు. ఇక
యీ అందమైన భార్యే ఆతనికి ప్రాణ
స్నేహితురాలు అవుతుంది. తామిరువురూ
ఒకటి. తమ ఆలోచనలు ఒకటి.

గర్వంగా నవ్వుకుంది మృదుల.

* * *

పెండ్లి వైభవంగా జరిగిపోయింది.
పెండ్లికి వచ్చినవారిలో మనోహర్
బంధువులకన్న స్నేహితులే ఎక్కువ
ఉన్నారు. మగమిత్రులమాట అలా ఉంచి,
అందర్నీ ఆకర్షించిన మరో విశేషం
తని ఆడమిత్రులు. నలుగురు లేడీ
...డ్స్ సరదాగా మనోహర్‌తో
...ట్లాడుతూ తిరగడం; అందులో
ఇద్దరు డాక్టరుకోర్సు చదువుతున్నారు.
మరోఆవిడ రేడియో ఆర్టిస్టు. నాల్గ
ఆవిడ గృహిణి—ఏదో లేడీస్‌క్లబ్ సెక్ర
టరీ అట. ఆ నల్గురిదీ నాల్గురకాల విశిష్ట
మైన అందం.

వాళ్ళ హాస్యోక్తులూ, ప్రియవచ
నాలూ విని మృదుల ఆశ్చర్యపోయింది!
సుమట నాసికంతో, పెదవులపై చిరు
నవ్వుతో, మనోహర్ మన్మథాకృతిలో
మెరిసిపోతున్నాడు. మృదుల ఆరాధ్య
దైవమైన వంశీమోహను మాదిరి
వున్నాడు. ఆమె హృదయం ఆనందంతో
రపళించిపోయింది.

"అదేమిటే మృదులా! ఆ ఆడ
పిల్లలు స్నేహితులట ఏమిటే మీ ఆయ
నకు! అలా చుట్టుకు తిరుగుతా రేం
చోద్యం!" పిన్ని, అత్తయ్యా బుగ్గ
మీద వేలేసుకున్నారు

"మనోహర్ శ్రీకృష్ణుడే కదటే!
అందుకని." ఒక మిత్రురాలు వేరొ
కావిడతో గుసగుసగా అంటున్నది.
ఆమె ఫక్కుమంది; మృదుల మనస్సు
చురుక్కుమంది

అత్తవారింట్లో మూడురోజులూ
గడిపి వారు ఇద్దరూ హనీమూన్‌కి
బెంగుళూరు వెళ్ళారు. ఆ రోజు లన్నీ
అందమైన కావ్యంలా, మనోహర
గీతిలా దొర్లిపోయాయి—మృదుల స్వప్న
లోకాల్లో తేలిపోయింది. మేఘమాలల్లో
విహరించింది.

* * *

"చూడుచూడు! అస్తమయ సూర్యుని
సౌందర్యశోభ—దూరంగా సముద్రగర్భం
లోకి వెళ్ళిపోతున్నాడు, ఒక బంగారు
బంతిలా ఎంత మనోహరదృశ్యం."

సంధ్యా సమయంలో, సముద్రం
ఒడ్డున ఆనందంతో అంటూన్నాడు
మనోహర్ భార్యతో.

మనోహర్ ప్రక్కనే ఇసుకలో
ఓరగా పడుకొని ఉంది మృదుల. భర్త
మాటలు విని అటు చూచింది. ఆమె
కన్నులు మిలమిలా మెరిశాయి.



"ఇల్లాంటి సుందరదృశ్యాల్ని చిత్రించాలని నాకు ఆకాంక్ష. కాని చిత్రలేఖనం పట్టుబడటంలేదు"; నవ్వాడు మనోహర్.

"ఇంత సున్నితంగా, పొడుగ్గా ఉన్న వ్రేళ్ళు అయితే చిత్రలేఖనం వస్తుందేమో!" మృదుల వేళ్ళను తాకుతూ అన్నాడు.

మృదుల నవ్వుతూ అతని వ్రేళ్ళను కదిలిస్తూ ఎటో చూస్తోంది.

"ఏమిటా పరధ్యానం"? మనోహర్ కూడా అటు తిరిగాడు.

సముద్రపునీళ్ళలో ఓసుందరి నిలబడి అలలతో ఆడుకుంటోంది. ఉధృతంగా వచ్చిన ఒక అల ఆమెను మోకాళ్ళదాకా తడిపేసి పోయింది. ఆమె నవ్వుతోంది. అందంగా దగ్గరలోనే, ఓ యువకుడు ఆమెవైపే చూస్తున్నాడు.

"ఏమిటంత ధ్యానంగా చూస్తున్నావు?" మృదులదృష్టికి చేయి అడ్డుపెట్టాడు అతడు.

"ఆమె ఎలా ఆడుకుంటోందో చూడండి ఆ నీళ్ళలో. ఆమె ఎలా వుందంటారు?"

"జలదేవతలా వుంది;" ఆమె వైపే

చూశాడు మనోహర్. మృదులకు కను బొమలు ముడుచుకుపోయాయి. కొంచెం ఆగి లేచికూర్చుంటూ "ఇక పోదామా?" అంది.

దారిలో ఇన్ని మల్లెలు కొన్నది మృదుల. మనోహర్ నాలుగు గులాబీలు ఏరి తీసుకున్నాడు.

ఆరాత్రి ఆమె అద్దంముందు కూర్చుని మల్లెలు తల్లో పెట్టుకుంటుంటే, మనోహర్ వెనక ఉన్నట్లు అద్దాలలో కనబడింది. అతడు చేతిలోని గులాబీని ఆమె తల్లో అలంకరిస్తూవుంటే, హఠాత్తుగా అడిగింది మృదుల మృదువుగా:

"మీ కళ్ళకు నే నిప్పు డెలా వున్నానో చెప్పరూ!"

మనోహర్ ఆమెచెవి మెలేశాడు నవ్వాడు.

"ఏం ప్రశ్న! అర్థంలేని ప్రశ్న!"

"చెబితే ఏం అరిగిపోరు;" ఆమె మూతి ముడుచుకుంది.

మనోహర్ ఆమె ముంగురులు సవరిస్తూ "నీవు నా రంగు రంగుల మనోజ్ఞ స్వప్నానివి," అన్నాడు. మనోహర్ కంఠం నిండుగా గంభీరంగా వుంది. ఆరాత్రి మృదుల హాయిగా నిద్రపోయింది.

*   *   *

"లే! లే! యింకా నిద్రపోతున్నావా?" ఆతృతగా మృదులను లేపాడు. ఆమె కళ్ళు తెరిచింది.

డిశంబరు నెల కావటంతో చాలా చలిగా వుంది. దుప్పటి సరిగ్గా లాక్కొని బద్ధకంగా ప్రక్కకుతిరిగి మళ్ళీ కళ్ళు మూసుకుంది మృదుల.

మనోహర్ కూనిరాగం తీస్తూ, అద్దం ముందు నిలబడి, తల దువ్వుకుంటు న్నాడు. మృదుల సగం కళ్ళుతెరిచి 'ప్రొద్దున్నే శ్రీవారి ఈ ఉత్సాహానికి కారణ మేమిటా' అనుకుంది. ఏదో స్ఫురించి ఒక్కసారిగా ఆమె లేచి కూర్చుంది.

"ఏమిటో యీ వుత్సాహం, ఎక్కడికో యీపయనం," అంది కవిత్వధోరణిలో.

మనోహర్ టై కట్టుకుంటూ, "నువ్వింకా అలాగే మంచంమీద కలలు కంటూ కూర్చో. యింకోక్షణంలో రైలు వస్తోంది. రైల్లో రాగిణి వచ్చేస్తోంది. నేను కారు తీసుకొని స్టేషనుకు వెడుతున్నా," అన్నాడు.

"ఓహో! ఇవ్వాళ ఆమె వస్తుంది కదూ?" మృదుల మంచం మీదనుండి లేచింది. అద్దం దగ్గరగా వస్తూ "అందుకా యీ వుత్సాహం అబ్బాయిగారికి; అర్థమైందిలేండి," అంది నొసలుముడిచి.

"అసూయేనా! ఛ! అది అనారోగ్యానికి హేతువు. సరేగాని కాఫీ టిఫిను రెడీ చేయించు, తొరగా వస్తాను. టా! టా!" మనోహర్ కదిలి పోయాడు. కారుశబ్దం వినిపించేదాకా

కిటికీ దగ్గరే నిలబడింది మృదుల, రాగిణిని గురించి తలపోస్తూ.

మనోహర్ రాగిణిని గురించి చాలా సార్లు చెప్పాడు. ఆమె ఒక పైలట్ ఆఫీసర్ భార్య; బెంగుళూరు నుండి వస్తోంది. వాళ్ళిద్దరూ బాగా స్నేహితులట. కాలేజీలో చాలా సౌందర్యవతి అంటూ మెచ్చుకుంటూ డా మెను మనోహర్.

మృదులమనస్సు ఎందుకో ఒక్క క్షణం అప్రసన్నమైంది. తానూ వెళితే బాగుండేదేమో ననుకుంది.

సరిగ్గా ఏడు గంటలకు, ఇంటిముందు కారాగింది. మనోహర్ దిగి, రాగిణికి డోర్ తెరిచాడు. రాగిణి దిగింగి. ఎఱ్ఱ రంగు బెంగుళూరు పట్టుచీర కట్టుకుంది. బుజాలనిండుగా షాల్ కప్పుకుంది. తెల్లనిరంగు, పొడవై సన్నమనిపించే ఆకారం, తీర్చి దిద్దినట్లున్న కనుబొమలు, చేరడేసికళ్ళు, నవ్వుతుంటే నాట్య మాడుతున్నట్లున్న పెదవులఒంపు, వాటికి వేసిన రంగుసొంపు, నడుస్తుంటే మహా రాణి అనిపించే హుందాతనం!

గుమ్మంలో నిలచిన మృదుల ముగ్ధురాలై చూచింది. ఇంతటి అపూర్వ సౌందర్యం యిలా ఒక్క చోటనే సిక్షిప్తం కావటం ఆమె యిదే మొదటిసారి చూడటం.

పరస్పరం పరిచయం చేశాడు మనోహర్. రాగిణి నవ్వుతూ "మీ పెళ్ళికి రావాలంటే వీలుపడలేదు. మొత్తానికి మంచి ఛాయిస్ కొట్టేశారు," అంది మనోహర్‌తో చిలిపిగా.

"రండి లోపల కూర్చుందాం!" మృదుల లోపలికి నడిచింది. రాగిణి అనుసరించింది.

మనోహర్ వెనక్కు వెళ్ళి కార్లోంచి ఏదో పొట్లం తెచ్చాడు. డ్రెస్సింగ్ టేబిలు ముందు పెడుతుంటే చూచింది మృదుల— అవి అప్పుడే వికసిస్తున్న గులాబీలు!

"ఎఱ్ఱగులాబీలంటే నాకు ప్రాణం. ఎలా గుర్తు పెట్టుకున్నాడో! మార్కెటు దగ్గర కారాపి మరీ కొన్నాడు మనోహర్;" స్నిగ్ధంగా నవ్వింది రాగిణి.

ఎంత మనోహరంగా ఉన్న దా నవ్వు! మృదుల ఎంతో ముచ్చటపడింది.

అసలే ఎఱ్ఱగులాబీలంటే మనోహర్‌కి అపరిమితమైన ఇష్టం. ఆతడి టేబిల్ పైన వాజ్‌లో ఎఱ్ఱగులాబీ ఎప్పుడూ వుంటుంది.

మృదులకు గులాబీకంటే మల్లెలన్నా విరజాజులన్నా యిష్టం. మృదులకోసం అవే ఎక్కువగా తెస్తా డెప్పుడూ మనోహర్. తన కిష్టమైనవే మృదులకీ ఇష్టమవాలనే తత్వం కాదు మనోహర్‌ది. ఎదటివారి అభిరుచుల్ని గౌరవిస్తాడు.

ఆ ఎఱ్ఱగులాబీలు తనలో ఏర్పరచబోతున్న అసూయను అణచివేసి, నవ్వుతూ సంభాషణలో పాల్గొన్నది మృదుల, కాఫీ తీసికొంటూ.

గ్లాన చనుకూరదు; ఆమె మనస్సులో చిన్న సుడి గాలి రేగింది.

మేట్ను అనుకుంటాను," అంది.

ఆమె నవ్వుతూ "మేమంతా ఒక గ్రూప్ లెండి—అల్లరికీ, డ్రామాలకీ, రాజకీయాలకీ — అన్నిట్లో మేమే ముందు. చాలా సందడిగా, ఆహ్లాదకరంగా గడచిపోయాయి ఆ రోజులు."

ఆ రోజుల్ని తలచుకొని కాబోలు యిద్దరూ ఒక్కసారి ఫక్కుమన్నారు. మృదుల చిన్నగా నవ్వి ఊరుకుంది.

రాగిణి అందంగా, చమత్కారంగా మాట్లాడుతుంది. కాస్త ఎక్కువగా ఆమె మనోహర్ తో మాట్లాడుతోంది. ఇద్దరూ [illegible]కటి విషయాలు చెప్పుకొని నవ్వుకుంటుంటే, కొంచం బాధ అనిపించి, యిబ్బందిగా కదిలింది మృదుల. నెమ్మదిగా లేచి, రాగిణి స్నానానికి ఏర్పాట్లు చేయించే నెపంతో వెళ్ళిపోయింది.

రాగిణి మూడు రోజులుంది. ఈ మూడు రోజుల్లో మృదుల మనోహర్ని కావాలనే ఎంతో కౌతుకదృష్టితో గమనించింది. రాగిణి సౌందర్యాన్ని మనోహర్ ఎంతగా ఆరాధిస్తాడో ఆమెకు అర్థమైంది. ఆమెకు గులాబీలు తేవటమూ, ఆమె డ్రెస్సుగురించి కామెంట్ చేయటమూ, ఆమె స్నిగ్ధ మందహాసమూ, చిలిపిగా 'నవ్వుండవోయ్! నీ అల్లరి నువ్వూనూ!' అన్న ఆమె రిమార్కూ, ఇవన్నీ చూసి మృదుల మనస్సు పాడు

వచ్చినరోజు సాయంత్రం...

ముగ్గురూ షికారు వెళ్ళి తిరిగివచ్చారు. వాళ్ళిద్దరూ హాలులో కూర్చుంటే మృదుల లోపలికి వెళ్ళి వంట ప్రయత్నము చూచింది. ఆమె తిరిగి హాల్లోకి వచ్చేటప్పటికి చిత్రమయిన దృశ్యం కంటబడింది.

మనోహర్ కళ్ళు మూసుకొని, ఏదో స్వాప్నిక జగత్తులో విహరిస్తున్నాడు. మనోహర్ చేతిలో రెండు గులాబీలూ, యిన్ని గులాబీ రేకులూ వున్నాయి. మృదుల అనుకుంది: 'ఈ గులాబీలు ఆ మహాతల్లి రాగిణి తల్లోవి కావు కాదా!' మృదుల ఆపాదమస్తకం చిరాకెత్తింది.


ఎలాంటి వ్యక్తనుకోవాలి ఈయనను?

ఈయన సౌందర్యారాధన ఏ కోవకు చెందినదనుకోవాలి?

ఏ భార్య సహిస్తుంది ఈ ప్రవర్తనను?

కోపంతో భర్తను కుదిపిలేపి "కాసిన్ని రేకులు తలమీద పోసుకోండి, పవిత్రమైపోతారు," అంది మండిపోతూ.

మర్నాడు ముగ్గురూ బీచికి వెళ్ళి, అటునుంచి సినిమాకు వెళ్ళారు. సగం దాకా రాగిణి సరదాగా కబుర్లు చెబుతూనే వుంది. పిక్చర్ సగంలో "అబ్బ! బోర్! తలనెప్పి దంచేస్తోంది; వెళ్ళిపోదాం మనోహర్!" అంటూ లేచింది. మనోహర్ వెంటనే లేచి 'పద, మృదూ!'




అంటే ఆ క్షణంలో ఆమెకు పట్టరాని కోపం వచ్చింది. సినిమా అంత బోరుగా ఏం లేదు. బెంగాలీకథ — మంచిఘట్టంలో కూడా వుంది. కేవలం మర్యాదకోసం లేచివచ్చిందామె.

ఇంటికి వచ్చారు. "అబ్బ! రెస్టు కావాలోయ్, పడుకుంటాను." అంటూ గుడ్ నైట్ చెప్పి, తనగదికి వెళ్ళిపోయింది రాగిణి.

మృదుల మరోమాట లేకుండా తనూ వెళ్ళి పడుకుంది. రాగిణిది ఆ దోరకం ప్రకృతి. ఏ మందిలో వున్నాసరే, తన మాట నెగ్గించుకుంటుంది. తనభర్త ఆమె మాట టా. చ తిప్పకుండా ఆదరించటం ఆమెకు ఒళ్ళు మంటగా వుంది. అందం అంటే అందరికీ ఇష్టం వుంటుంది; కాని, దానికీ హద్దు లున్నాయి. రాగిణి వివాహిత; ఆమెతో తనభర్త అంత స్నేహంగా వుండటం ఆమెకు కంటగింపుగా వుంది; సహించలేకపోయింది. తమ పెళ్ళి కాకముందు వాళ్ళిద్దరిమధ్యా ఏదో ప్రేమవ్యవహారం వుందేమో. సన్న అనుమానం బలపడసాగింది. మంచం మీద పడుకుని మృదుల మనసు పాడు చేసుకుంటోంది.

"మృదూ!" మీదికి వంగి పలుకరిస్తున్న భర్త పిలుపు.

కళ్ళు విప్పి చూసింది. తీయగా చిరునవ్వు నవ్వుతూ మనోహర్!

"అబ్బ! నా కళ్ళు మండుతున్నాయి. నన్ను మాట్లాడించకండి. నిద్రపోవాలి;" విసురుగా ప్రక్కకుతిరిగి పడుకుంది.

"ఏమిటి? ఎందుకలా విసగ్గా వున్నావ్!" ఆ కంఠంలో మార్పులేదు.

"విసుగొకటి తక్కువ;" అలాటి సమయాల్లో, ఎంతో హాయిగా శ్రీనోట ధ్వనిస్తున్న నిషుంతే ప్రమోగించింది.

రేపు రాగిణి వెళ్ళిపోతుంది. ఆరోజు

మనోహర్ పాత మిత్రులను టీకి పిలిచాడు.

రాగిణి అజంతా శిల్పాంలా తయారయ్యింది. పెద్దముడి వేసుకుని, తెల్ల గులాబీలు ముడిలో సింగారించుకుని, తెల్లని బట్టల్లో, పాలరాతి విగ్రహంలా మెరిసిపోయే రాగిణిమీదే అందరి చూపు లున్నట్లు గ్రహించింది మృదుల. రాగిణిలో ఏదో ఆకర్షణ వుంది. ఇతరులని మంత్రించే ప్రభావం వుంది. అదే అందర్నీ ఆకట్టుకొంటుంది. మనోహర్ దానికి అతీతుడు కాడు.

కాని మృదుల దృష్టి వేరు. మనోహర్ తనవాడు. ఆత డా ప్రభావంలో పడిపోవటం ఆమెకు బాధగావుంది. ఈర్ష్యతో దగ్ధమైపోతూంది ఆమె మనస్సు. 'ఈ రాగిణి ఇక్కడి కెందుకు వచ్చిందిరా బాబూ!' అంటూ నుదురు కొట్టుకుంది.

మృదుల మనోభావాలు గమనించని రాగిణి మృదులతో మొదటినుండీ మామూలుగానే వుంది. నవ్వింది, నవ్వించింది, కబుర్లు చెప్పింది.

'అంతా నటన!' అనుకుంది మృదుల.

మర్నాడు రాగిణి వెళ్ళిపోయేరోజు కాఫీ లవుతుంటే మనోహర్—"పద, స్టేషన్‌కు వెడదాం," అన్నాడు, మృదుల వైపు కుతూహలగా చూస్తూ. బహుశా రాత్రి విషయం ఆతనికి గుర్తు వచ్చి వుంటుంది.

తాను రాగిణిముందు బైటపడిపోవటం మృదులకు సుతరామూ యిష్టంలేదు. ఆమెది గంభీర ప్రకృతి. అలాగేనంటూ త్వరగా ముస్తాబై వచ్చింది.

"మీది చాలా చక్కనిజంట. నాకు చాలా సంతోషంగావుంది మీతో గడపగలిగినందుకు," అంటోంది రాగిణి, మహారాణిలా వాలుకుర్చీలో వెనకకు వాలి.

'నీరిమారుక్కా మా కేంఅక్కర్లేదు.' కసిగా అనుకుంది మనసులో మృదుల.

"నువ్వప్పుడే వెళ్ళి పోవటం మాత్రం నాకు బాగాలేదు," అంటున్నాడు మనోహర్.

"తప్పకుండా ఒకసారి బెంగుళూరు రండి యిద్దరూ!"

"తప్పకుండా!" అన్నాడు మనోహర్

'మళ్ళీ నిన్ను కలుసుకోవటమా! అసంభవం', అనుకుంది ద్వేషముగా మృదుల.

స్టేషనుకి వెళ్ళారు. బండి వచ్చిన తరువాత, ఆమె ఇద్దరితో కరచాలనం చేసి బండి ఎక్కింది. బండి సాగిపోతుంటే, రుమాలు వూపుతో, మనోహర్ కొన్ని అడుగులు ముందుకు వేయటం చూచి, మృదుల నుదురు చిట్లించింది.

* * *

ఇల్లాటి సంఘటనలే ఎన్నోసార్లు ఎదుర్కోవలసి వచ్చింది, ఆమె తన వైవాహిక జీవితంలో. మృదువైన ఆమె హృదయంలో ముళ్లు గుచ్చుకుంటు



న్నాయి. అంతా అర్ధమయ్యా డనుకొన్న భర్త అనుక్షణం ఆమెకు అర్థమవకుండా పోతున్నాడు.

ఎవరో ఫ్రండ్ బహూకరించిందని ఆమె చిత్రం ఒకటి ఫ్రేమ్ కట్టించి, పడగ్గదిలో అలకరించుకున్నాడు.

రంజని అన్న మిత్రురాలు చాలా బాగా పాడుతుందట. ఆమెపాట టేప్ రికార్డర్లో ప్రతీరాత్రి విననిదే, ఆతనికి నిద్రపట్టదు.

ఒకసారి విసుగేసి, కోపం వచ్చి "ఏమిటి మీ కింతమంది లేడీ ఫ్రండ్స్! విన్నవాళ్లూ, కన్నవాళ్లూ విస్తుపోతున్నారు," అంది కోపంగా.

"నాకు లేడీఫ్రండ్స్ అంటే నే ఎక్కువ ఇష్టం. వాళ్ళ కంపెనీలోనే నాకు సరదాగా వుంటుంది. ఏం! ఈర్ష్య పడుతున్నావా? ఆడదాని వనిపించు కున్నావు," అంటాడు నవ్వుతూ.

మృదుల కాతని తత్వం అర్థం కావటము లేదు. సహించలేక పోతోంది; విసుగేస్తోంది. కానీ భర్తను ఇలా వూహించుకోలేదు; అనేక ప్రవృత్తి అని సరిపెట్టుకోలేక పోతూంది. ఇన్నిటిమధ్య — ఆమె మనోహర్‌ని 'నావాడు' అనుకోలేకపోయింది. అసంతృప్తి మనసు నిండా పేరుకుని, ఆమె ముఖం వాడిపోవటం మొదలెట్టింది.

చిత్ర మేమిటంటే, ఎన్ని పనులు చేస్తున్నా, ఎక్కడున్నా 'మృదూ! ఇలారా!' అనో, 'మృదూ! ఏంచేస్తూన్నా' వనో ఆయన పిలుపు వినబడుతుంది. మండే మంటకాస్తా చల్లారుతుంది.

మిత్రురాలు మనోరమ పెళ్ళిముందు చేసిన సూచన గుర్తు తెచ్చుకుని 'అహం భావంతో అనా దేదో అన్నాను. ఈనాడు సరిపెట్టుకోవటంలో సంఘర్షణగా వుంది; చేతకావటంలేదు మనూ!' అని నిట్టూరుస్తుంది.

*   *   *

మునిమాపు వేళ.

గదిలో కిటికీముందు కూర్చుని బయట తోటలోకి చూస్తోంది మృదుల హేమంత ఋతువు. తోటంతా వాడి, ఎండిపోయిన పూలతో, చెన్నుతరిగి వుంది. ముసురుకుంటున్న ఆలోచనలను, వదలించుకోలేక, చేతుల్లో ముఖం దాచుకుంది.

"ఏం చేస్తున్నావ్! డార్లింగ్!... మైగాడ్! ఏమిటలా వున్నావు? ఏం? ఒంట్లో బాగాలేదా?" ఆమె తల పైకెత్తి కళ్ళల్లోకి చూస్తూ చెంపకు చెంప ఆనించాడు మనోహర్, స్వచ్ఛమైన చిరునవ్వుతో.

గుండెభారం తగ్గి హాయనిపించింది భర్త లాలింపు ఆమెకు.

"ఎక్కడకైనా వెడదామా! పిక్చర్‌కైనా, బీచ్‌కైనా!" లాలనతో కూడిన అభ్యర్థన. ఆమె ముంగురులు సవరిస్తూ అన్నాడతడు.

ఆతని కౌగిలిలో కరిగిపోతూ 'ఊఁ!' అంది మృదుల.

హాల్లో ఫోను గణగణ మ్రోగింది. మనోహర్ వెళ్ళి రిసీవర్ ఎత్తాడు. మృదుల చెవులు రిక్కించుకుంది.

"ఎవరూ!...... మిసెస్ రఘురాం! ఏమిటి విశేషం?...... అర్జంటా...... అయ్యో! యిప్పుడే వస్తున్నా...... అలా!...... సరే"......

మృదుల నొసలు చిట్లించి, కిటికీ కానుకుంది

"ఏమయిందో విన్నావా? మా కొలీగ్ రఘురాంగారికి యాక్సిడెంట్ అయిందట! లత ఫోన్ చేసింది. చాలా అపాయస్థితిలో వున్నాడు పాపం! ఒక్కసారి వెళ్ళి వస్తాను." అన్నాడు గబగబా.

మృదుల గిరుక్కున వెనక్కు తిరిగింది — కోపంతో కళ్ళు ఎఱ్ఱబడ్డాయి; పెదవు లదరుతున్నాయి.

"మీకు బయిటి ప్రపంచం చాలు. భార్య ఎందుకులెండి. ఏం? ఆయనకు పిక్సిడెంటు అయితే మీరెందుకూ? ఆవిడ మీకే ఎందుకు ఫోన్ చేయటం? వాళ్ళ వాళ్లు చూచుకోలేరూ? మీరు వెళ్ళక్కర్లేదు; మరేం పుట్టి మునిగిపోదు"

షర్టు వేసుకుంటున్న మనోహర్ బిత్తరపోయి చూశాడు అర్థం కానట్లు.

"ఏమయింది నీ కివాళ? ఏమిటి ను వ్వంటోంది?" అన్నాడు అప్రతిభుడై.

"ఏమిలేదు. అర్థం అయీ కానట్లు మీ రేం అభినయించనక్కరలేదు;" తల తిప్పేసుకుంది విసురుగా.

"నీ వేదో ఆవేశపడుతున్నట్లున్నావు. అపార్థం చేసుకుంటున్నావు మృదూ! తొందర పడకు. నాకు నిన్ను మించిన మిత్రు లెవరూ ఎప్పుడూ వుండరు. ప్రస్తుతం అర్జంటుగా వెళ్ళాలి. ప్రాణాపాయ పరిస్థితి అది. తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం! వస్తా;" ఒక నిట్టూర్పు విడిచి మనోహర్ బయటకు వెళ్ళి పోయాడు.

'తీరిగ్గా గోడలతో మాట్లాడుకోండి. ఇంత మనక్షోభ అనుభవిస్తూ నే నుండ నిక్కడ.' కసిగా అనుకుంటూ గబగబా సూట్ కేసు సర్దుకొంది. టేబిల్ పైన కాగితం అందుకుని నాలుగు ముక్కలు గిలికింది.

"మృదుల అన్న వ్యక్తిని మీరు తేలిగ్గా మరచిపోగలరని నా విశ్వాసం. మీ లేడీ ఫ్రెండ్స్‌తో మీరు సుఖంగా సరదాగా కాలం గడిపెయ్యగలరు. అపార్థం చేసుకుంటున్నా నన్నారు. అర్థం చేసికోవటానికన్నా అపార్థం చేసికోవటానికే అవకాశాలు ఎక్కువ ఇచ్చారు. నాదే తప్పయితే తిరిగి వస్తాను — వెళ్తు.

మీకు దూరంగా వెళ్ళిపోతూన్న,

మృదుల.

కాగితం టేబిల్ పైన వుంచి రాత్రి బండికి వెళ్ళిపోయింది మృదుల.

* * *

తిరిగి భర్త దగ్గరికి వస్తూన్న, మృదులకు హైయికు రైలు అందలేదు. అందివుంటే, కొంత ప్రశాంతముగా అయినా వుండేది మనస్థితి. మృదుల విసుక్కొంది అందని రైలుమీద ...

పరిపరివిధాల పోతూన్న మనసుతో, నాలుగునెలలు గడిపింది. రోజుకో ఆవేదన, గంటకో ఆలోచన. కాలమే స్తంభించి పోయినట్లనిపించిందో మృదులకు.

కాని స్తంభించేది కాలంకాదు. స్తంభించేదైనా, స్పందించేదైనా మనమే! మన అంతఃకరణలే!

తనదే పొరపాటేమో! మనోహర్‌ని తానే సవ్యంగా అర్థం చేసుకోలేదేమో! అతనిలో వున్న బలహీనతను గుర్తించి అనుకూలంగా నడచుకోలేక పోయిందేమో!

ఇన్ని ఆలోచనలతో, సతమత మవుతూ వుంటే, ఒకసారి మనోరమ వచ్చింది. ఆమెను చూడగానే మృదుల ముఖం వాడింది.

అంతా మృదులవల్ల విని మనోరమ ఆమెను ఓదార్చింది. "నేను ముందే చెప్పాను మృదూ! మనోహర్ లాంటి మనస్తత్వం వున్నవాళ్ళకి భార్య అయితే చాలా ఓర్పు, సంయమనం వుండాలి. అతనిని నీవు ఆ కోణంలోంచే ఎందుకు చూస్తావు! అతడు తన స్నేహితులను ఆడైనా మగైనా స్నేహితులుగా చూస్తాడే గాని వేరేదృష్టి వుండదని నా అభిప్రాయం. అర్థంచేసుకో మృదూ! అర్థం చేసుకుని సర్దుకుపోవటంలోనే సుఖం వుంది. సామాన్యమైన స్త్రీలా ప్రవర్తించకు." అంటూ ఎన్నో చెప్పింది.

మృదుల మెత్తబడింది.

నిజమే. మానవులంతా ఒకలా వుండరు. అర్థం చేసుకోవాలన్న ఆశయమూ మనసూ ముఖ్యం; లేకపోతే ఇకపైన మిగిలే దేమిటి?

ఈ ఆలోచనలతో ఒక నిర్ణయానికి వచ్చేసి గబగబా బాగ్ సర్దుకుంది.

మృదుల ఏ నిర్ణయానికి వచ్చినా చాలా త్వరగా వస్తుంది. అవి మెరపువంటి నిర్ణయాలు.

"మనోహర్ చాలా దిగులుగా వుండి వుంటాడు. తను లేకపోతే ఆయనకు తోచదు; ఇల్లంతా బోసిగా వుంటుంది. తనను చూచి ఎంతసంతోషిస్తాడో! ముఖ భావాలు ఎలా ఉంటాయో? చేతులు చాచి ఆహ్వానిస్తాడా? మందస్మితంతో ముందు కొస్తాడా?" మృదుల ఋర్రవిండా ఆలోచనలే!...

రైలు వచ్చింది. ఆలోచన లాగాయి. గబగబా బేగ్ అందుకొని బండి ఎక్కింది.

* * *


మృదులను గురించి ఆలోచిస్తూ, తన గదిలో మంచంమీద పడుకుని ఉన్నాడు మనోహర్.

'మృదుల — ఇప్పుడు ప్రక్కన లేదు. వస్తుందో రాదో? — మృదుల తలంపు లోనే తన కెంతో మధురిమ దొరుకు తుందే! తన తలంపు ఆమె కలాంటిది కాదా!" మనోహర్ ఆలోచిస్తున్నాడు.

'మృదులా నీవు నన్నపార్థం చేసి కున్నావా? ఈ అనర్థానికి నే నెంతవరకు బాధ్యుడిని? అందం అంటే ఆదేమిటో నా అంతరంగం అంత పులకించి పో తుంది. అంత ఆరాధనకు లోనవుతాను—

'అనంతా నవ్వుతున్న గులాబీ సోయగంలో, సౌందర్యాన్ని నింపుకున్న స్త్రీ మూర్తిలో, అందమైన ప్రకృతి దృశ్యాలలో, నా కేదో అదృశ్యశక్తి కనిపిస్తుంది. అదే భగవంతు డను కుంటాను.

'నా హృదయమే ఆ భావానికి స్పందిస్తుంది. ఈ నా స్వభావం నీలో లేదని




ఒకప్పుడు నే ననుకున్నా. ఈర్ష్యాసూయలను రెచ్చగొడుతుం దని అనుకోలేకపోయాను. అపార్థం చేసుకున్నావు నన్ను.

"మృదూ! సున్నితమైన ఈ భావావేశానికి లొంగిపోయే నన్ను, నీ వెప్పుడర్థం చేసుకుంటావు ?

"ఎప్పుడు తిరిగి వస్తావు ?

"ఎప్పుడు ? — ఎప్పుడు ?"

ఆతనికళ్లు అర్థనిమీలితా లయినయి. మంచాన్నంతా ఆక్రమించుకున్న ఎఱ్ఱగులాబీరేకులు జాలిగా ఆతన్ని స్పృశించినయి.

తెలతెలవారుతుం డనగా మనోహరుకి మెలకువ వచ్చింది. కిటికీలోంచి క్రిందికి చూశాడు.

విచ్చుకుంటున్న ఎఱ్ఱగులాబీ ఒకటి ఆతన్ని చూసి నవ్వింది మనసు హాయి అనిపించింది. లేచి తోటలోకి వెళ్ళటానికి క్రిందకి నడిచా డతడు.

గుబగుబలాడుతున్న గుండె
ఏదో అనిర్వచనీయమైన సంతృ
మృదుల మళ్ళీ తన ఇంట్లో అ
పెట్టింది. మనోహర్ ఆలోచనలే మ
సంతా నింపుకొని, హాలు దాటి పడకగదిలోకి తొంగిచూసింది.

మంచం మీద మనోహర్ లేడు. దుప్పటి నలిగిఉంది. తలగడానిండా, దుప్పటిపైనా అక్కడక్కడా ఎర్ర గులాబీరేకులు_నలిగిపోయి పేలవంగా నవ్వుతూన్న పూరేకులు. ఒక్కక్షణం అలా నిలిచి చూచింది వింతగా.

అవి చూస్తుంటే మెరపులా ఏదో ఆలోచన రావటం, కన్నులలో నీలిమ పోయి

ఎర్రగులాబీరంగు వచ్చింది; క్రోధం రెచ్చిపోయింది.

విభ్రాంతపడి చూచింది. గిర్రున కంట నీరు తిరిగింది. ఆమె మనస్సు పరిపరి విధాల పోయింది. తనను చూచి తానే సిగ్గుపడింది. తా నున్న పరిస్థితికి తనను తానే అసహ్యించుకుంది.

"అవును. తాను లేకపోతే నేం? భార్య ప్రక్కన లేదే అన్న ధ్యాసా, ఆవేదనా ఆయనకు లేవు. ఆయన సరదాలాయనవి, ఆయన జీవితం ఆయనది! తాను లేనిలోటు తీర్చగల స్నేహసంపద ఆయన కున్నది. నిత్యం సుఖజీవితం గడపగల స్తోమతా ఆయన కున్నది. నెందుకొచ్చిం దిక్కడకు! తాను లేక వారి కేమి లోటు?"

మృదుల ఆల గిర్రున తిరిగింది. తమైన మనస్సుకు బలమైన దెబ్బ ంది. తాను అతనితో ముఖాముఖి మాట్లాడి అపార్థాలు తొలగించుకోవాలని ఆశపడింది.

ఆవేశంలో బయలుదేరి వచ్చింది. పాలపొంగులాంటి ఆవేశం అణిగిపోయింది.

ఎలా భర్త కెదురుపడడం!

ఏమని మాట్లాడటం?

ఆస లేమని మాట్లాడాలి కనుక — ఆ అవసరం ఏముందిగనక!...మనోహర్తో కలిసి అనుక్షణం వ్యధను పొందుతూ ఆ నరకం తా ననుభవించ లేదు!

ఈ చెదరిన వీణపై యిన్ని అపశ్రుతులతో తాను జీవనరాగం ఆలపించ లేదు!!

వెళ్ళిపోవాలి! తక్షణం యిక్కడి నుండి వెళ్ళిపోవాలి! మనోహర్ కంట బడకుండా త్వరగా వెళ్ళిపోవాలి!

పూలరేకులతో నిండిన ఆ మంచం వంక ఒక్కసారి జుగుప్సతో చూచి గిరుక్కున వెనుదిరిగింది మృదుల.

పై మెట్టుపై కాలుపెట్టిన మృదుల కంటికి తాపీగా మెట్లెక్కుతున్న మనోహర్ కనిపించాడు.

పైకి చూసిన మనోహర్ కళ్ళు క్రోధంతో చూస్తున్న మృదుల చూపుల నెదుర్కొన్నాయి.

ఒక్కక్షణం అతనిలో, ఆనందంతో కూడిన సంభ్రమం కనిపించింది. రెండేసి మెట్లు చొప్పున ఎక్కుతూ అతడు పైకి వస్తూంటే, అతని ముఖంలోకి చూస్తూ అలాగే నిలబడిపోయింది మృదుల. ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా వుండే అతనిలో ఏదో మార్పు, లోతుకుపోయిన కళ్లు—కళావిహీనమైన ముఖం—అదేమిటి? అలా అయిపోయాడేమిటి?

తన్ను చూడగానే అతని ముఖంలో విరిసిన ఆనందరేఖను ఒక లిప్తపాటు విస్తుపోయి చూసింది మృదుల.

అంతలో పైకి వచ్చిన మనోహరు, ఆమె చేయి నందుకుంటూ — "ఎన్నాళ్ళకు మృదూ"— అన్నాడు నిండుగా అనురాగంతో.

ఒక్క క్షణం మృదుల కరిగి పోయింది. భర్త స్పర్శ విద్యుత్తులా శరీరమంతా ప్రాకింది.

అంతలో అప్పుడే తాను అతని మంచంమీద చూచిన నలిగిన గులాబీ రేకులు - తన ఊహలో అత నెంత దిగ జారిపోయినదీ - తలపు కొచ్చే సరికి ఆమెకు ఒళ్ళంతా జలదరించిపోయింది.

చివ్వున అతని చేయి విసిరించుకుని, మెరుపులా మెట్లు దిగింది మృదుల.

ఆ ధోరణీ, ఆవేశంతోకూడిన ఆ కోపం చూసిన మనోహరు నిర్ఘాంత పోయాడు.

మనసు విచ్చుకుని తనకోసం ఈ సుప్రభాతాన వచ్చిన మృదుల అంతలో అంతగా మండిపోతూ వెళ్ళిపోవలసిన సంఘటన ఏంజరిగింది?- అతనికి అర్థం కాలేదు.

అతడు గబగబా దిగివచ్చి, మృదుల దారి కడ్డంగా నిలబడ్డాడు.

మృదుల తీక్షణంగా చూస్తూ తల ఎత్తింది.

"ఏం జరిగింది మృదూ? ఏమిటింత కోపం? నా మీదే!" అతని మాటల్లో సౌమ్యత, స్నేహం.

"తెలియకే అడుగుతున్నారా?" నొసలు చిట్లించి కఠినంగా అందామె.

విభ్రాంతు డయ్యాడు మనోహరు. ఆమె ధోరణి అతని కర్థం గాకుండా వుంది.

"మృదూ! ఒక్కటి గుర్తుంచుకో! తెలిసి నీకు కష్టం కలిగించే పని ఇంత వరకూ నే నేం చేయలేదు, చేయలేను కూడా!" మనోహరు గంభీరంగా అన్నాడు. అతని ముఖంలోని బాధను స్పష్టంగా చూసింది మృదుల. అయినా ఆమె చలించలేదు.

"మీరెంతా నటనా, మోసం!" ఆమెకు ఆవేశంలో ఆలోచనలు రావటం లేదు.

"నటనా! మోసమా! విచిత్రంగావుంది నాకు. ఏమిటి నీయీ ప్రవర్తన! నీవు ఎందుకు వెళ్ళిపోయావో, ఎందుకొచ్చావో అర్థం కావటం లేదు. పోనీ నా అపరాధ మేమిటో చెప్పివెయ్యరాదూ!" మృదుల మనస్సులో చెలరేగుతున్న తుఫానుకు కారణ మేమిటో తెలుసుకోవాలన్న ఆరాటంతో అడిగాడు.

"అపరాధం - మనస్సులోని కుళ్ళు ఇంకా తెలియదనే! అపరాధం చెప్పాలిట..." ఒళ్ళు మండిపోతోంది మృదులకు.

"నీ వలా మౌనంగా ఉంటే నే భరించలేను. మాట్లాడు మృదూ! ఇన్నాళ్ళకు నీకు దయగల్గిం దనీ, నన్ను నా దరికి చేర్చిన ఈ ఉషస్సు ఎంతో ఆహ్లాదకరమైనదనీ, ఆనందంతో పొంగిపో తున్న నన్ను ఇంకా బాధించి చంపక, అసలు విషయం చెప్పు!" మాట్లాడు తున్న ప్రతి మాటలోనూ అతని హృదయావేదన ప్రస్ఫుటంగా వ్యక్తం అవుతోంది.

'ఈతడు దోషి కాదేమో!'

మృదులమార్చుకోబోయిన మనస్సు ముందు, నలిగిన గులాబీరేకులు వికటంగా నవ్వాయి. ఆమె కఠినత్వపు ముద్ద అయిపోయింది.

ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న మనోహరు మరో రెండడుగులు ముందుకు వేస్తూ "చెప్పు మృదూ!" అన్నాడు.

ఆ కళ్ళల్లో కనిపించే వెలుగురేఖలు చూసిన మృదుల మనస్సు ఒక్కసారి భగ్గుమంది కళ్ళు క్రోధంతో ఎరుపెక్కాయి.

''చెప్పు మృదులా!'' మనోహరు నొక్కి అడుగుతున్నాడు.

"చెపుతాను. ఒక్కసారి కాదు, వెయ్యిసార్లు చెపుతాను. మృదుల అనేది ఒకతుందనీ, మిమ్మల్ని ఆరాధించి మోసపోయి విలపిస్తోందనీ మీ కేనాడైనా గుర్తు వచ్చిందా?"

"మోసమా!" విస్తుపోయాడు.

"అలా తెల్లపోతారెందుకు? మీ నటనాచాతుర్యం నా దగ్గర పనిచేయలేదనా?"

మాటలు మధ్యలో ఆపేసి గిరుక్కున వెనకకు తిరిగింది మృదుల.

ఆతడు చివాలున ముందుకు వచ్చి ఆమె చేయి పట్టుకుని ఆపి, "నువ్వెంత చెప్పినా నా మోస మేమిటో అర్థం గావటములేదు ఆ చెప్పే దేదో సూటిగా చెప్పెయ్యి నాకోసం అంత దూరంనుంచి వచ్చిన నీలో, అంత మార్పు తెచ్చిన సంఘటన ఏమిటి? చెప్పితేగాని వెళ్ళనివ్వను;" మనోహరులో పట్టుదల కనిపించింది. చేయి వదిలించుకోలేక పోయిందామె.

"నేను మీ పడకగదిలో కెళ్ళి వచ్చాను. ఇంకా ఎందుకు బుకాయిస్తావు?" మృదుల కంఠస్వరం కఠినంగా ఉంది.

"అక్కడేముంది - నీవంత ఆసహ్యించుకోవటానికి-రామకృష్ణ పరమహంస ప్రవచనాల పుస్తకం తప్ప?" అడిగాడు చాలా తాపీగా, నిర్లిప్తంగా ఎటో చూస్తూ.

"లేవని నా ముఖం చూసి చెప్పగలరా?"

"ఆ," స్థిరంగా నిర్భయంగా వచ్చింది సమాధానం. మృదుల తెల్లబోయింది; రోషం వచ్చింది.

"ఓహో! అయితే సరే! ఆ దుప్పటి నిండా - ఆ నలిగిన గులాబీ రేకులు? ఏ గంధర్వకాంత లొచ్చి చల్లిపోయారో," వ్యంగ్యంగా అన్నది మృదుల.

.విషయం తెలిసేసరికి మనోహరుకి ఫక్కున నవ్వు వంచ్చిది ఎదురుగా అసహనంతో, అనుమానంతో నిలబడ్డ మృదులను చూసేసరికి పైకి నవ్వలేక పోయాడు. కానీ ముఖంనిండా మందహాసరేఖలు పరచుకున్నాయి.



ఏందయ్యో- మరీనూ- ఎక్కువంటావ్
తక్కువంటావ్- ఇహనించి ఉతకడమే
నావంతు- బట్టలకి గంజి నువ్వే పెట్టుకో

ఎలా మృదుల అనుమానం నివృత్తి చెయ్యటం! ఆవేశంలో అసలు పరిస్థితి అర్థం చేసుకుంటుందా? ఈర్ష్యాసూయలకు మరోపేరు స్త్రీ అన్నారు విజ్ఞులు. వారిలోని ఆకర్షణలో ఇదీ ఒక అంశమే! అలా అసూయతో, అపార్థంతో నిలచిన మృదులను చూస్తే ముచ్చట వేసింది మనోహరుకి, కానీ మొహం గంభీరంగానే పెట్టుకున్నాడు.

"ప్రేమలో నమ్మకం అంటూ లేక పోతే అది నీటిబుడుగలాగా తేలిపోతుంది. నాలో నమ్మకం నీకు తగ్గిననాడు భార్యవని నేను నీ కేమీ ఆంక్షలు విధించను. పోతే ఒక్కమాట. నీ మాటలో సత్యం అనేది ఎంతవరకుందో తెలుసుకు మరీ వెళ్ళు; అంతే!"

మనోహరు కిటికీ దగ్గరకు నడచి బయటకు చూస్తూ నిలబడ్డాడు.

మృదుల తలెత్తింది. మనోహరు వీపు కనిపిస్తూంది. ఆమెలో సంఘర్షణ బయలుదేరింది.

"తాను తొందర పడిందా?"

పడకగదిలో తాను చూసిన గులాబీలతోపాటు ప్రక్కనే స్టూలుమీద తెరచి పెట్టివున్న రామకృష్ణ పరమహంస ప్రవచనాల పుస్తకం ఆమె కంటిముందు మెరిసింది 'అందమైన స్త్రీ ముఖములో, జగన్మాత స్వరూపాన్ని చూడాలి' అన్న రామకృష్ణ వాక్యాన్ని అతడు ఎర్రసిరాతో అండర్‌లైన్ చేసికొని ఉండటం ఒకప్పుడు తాను చూసింది. ఈ రెంటికీ పొత్తెక్కడో ఆమె కర్థం కాలేదు. తన మాటల్లో ఎంత సత్యం ఉందో తానెలా తేల్చుకుంటుంది! ఎవరి నడుగు

తుంది? భర్తగాక ఇంట్లో ఉన్నవాళ్లు నౌకర్లు.

భ_భర్త మాటమీద లేని నమ్మకం మూడో వ్యక్తిమీద ఎందు కుంటుంది? అలా వుంటే అది తమ వ్యక్తిత్వాలకే దెబ్బ.

'మనోహరును పెళ్ళాడమంటే నీవు ఈర్ష్యను జయించాలే మృదూ!' మనోరమ మాటలు స్మృతిపథంలో మెరిసినయి.

'అందమే ఆనంద మనుకునే తత్వం మనోహరుది' అని ఆనాడు మనోరమ చెప్పింది

ఇన్నేళ్ళ సాహచర్యంలో తాను ఆత న్ని గోంచలేంచె అర్ధం చేసికోవ టానికి ప్రయత్నించింది

మృదుల బుర్రనిండా ఆలోచనలు భర్త మాటలపై విశ్వాసం లేక తాను చేయ బోయే ఘనకార్య మేమిటి? భర్త ప్రవర్తనలో ఆమెకు ఆలోచించసికొద్దీ వెన్నెలలాటి స్వచ్ఛతే గోచరిస్తోంది,

క్షణిక ఉద్రి ఆవేశం, మెరుపువంటి నిర్ణయాలు; అంతలో అనుమానాన్ని అధిగమించి పెల్లుబుకుతున్న స్నేహం.

"మిమ్మల్ని నమ్ముతాను_కానీ..."

మృదుల కళ్ళల్లో నీళ్ళు నిలుస్తున్నాయి.

భర్తనే నమ్మకపోతే తనను తానే నమ్మలేదు. ఒక్కటిమాత్రం స్ఫుటంగా తెలిసి వచ్చింది, మృదులకు. మనో హర్‌లో బలహీనత ఉండవచ్చు. తాను మనఃక్లేశానికి గురి కావచ్చు, కానీ ఆతడు బాధ పడుతుంటే చూచిమాత్రం సహించలేదు. తాను అతని ప్రక్కన లేకపోతే తన భావాలకు బలమేలేదు

మృదుల ఒక నిశ్చయానికి వచ్చింది.

ఆమె నిశ్శబ్దత అర్థంకాని మనో హర్ ఆసక్తిగా వెనుకకు తిరిగి చూశాడు.

తనవంకే ఆర్ద్రంగా చూస్తున్న మృదులవైపు నడచి భుజంపై చేయి వేసి "దేవిగారి కీ దీనునిమీద ప్రసన్నత కలిగినట్టుందే!" అతని పెదవులమాటున నవ్వు దోబూచులాడుతోంది.

"నన్ను క్షమించరూ!" అన్న భావం ఆమె కళ్ళల్లో కదలాడింది_అతని భుజంపై ఒరిగిపోయింది మృదుల. ఆమెమనస్సు ఉషస్సమయంలో తుషార బిందువులతో నిండిన గులాబిలా స్వచ్ఛంగా వుంది.